ఇన్ఫోగ్రాఫిక్

# షాదీ దారిదీ!

**జీవితంలో పెళ్లి మరపురాని మధురఘట్టం. కొత్తతరం ఆ వేడుకను ప్రత్యేకంగా జరుపుకోవాలని అనుకుంటున్నది. విభిన్నమైన ఆలోచనలతో వివాహానికి సిద్ధం అవుతున్నది. ఖర్చుకు వెనుకాడటం లేదు. వేదికలుగా రాజస్థాన్ కోటలనో, సముద్ర తీరాలనో, అటవీ ప్రాంతాలనో ఎంచుకుంటున్నది. ప్లానర్లను నియమించుకుంటున్నది. సెలెబ్రిటీలను ఆహ్వానిస్తున్నది. ప్రత్యేకించి తమ వివాహం కోసం థీమ్ సాంగ్ రాయించుకుంటున్నది. పేరున్న గాయకులతో సంగీత కచేరీ ఏర్పాటు చేస్తున్నది. ఇప్పుడు, వివాహం ఓ ఈవెంట్.**



## వెడ్డింగ్ మాల్స్



నవతరం జంటల ఆశలకు అనుగుణంగా పెళ్లి వస్తువులన్నీ ఒకే దగ్గర విక్రయించే దుకాణాలూ వస్తున్నాయి. ఢిల్లీ నివాసి వికాస్ గుట్ గుటియా ఈ కాన్సెప్ట్‌తో పెళ్లిళ్ల సీజన్ ప్రారంభానికి ముందే 'షాదీ మాల్' తెరిచాడు. గత ఏడాది 215 పెళ్లిళ్లకు ఏర్పాట్లు చేసిన 'ఫెర్న్స్ అండ్ పెటల్స్' సంస్థ ఈ ఏడాది 250 వివాహాలు నిర్వహించనుంది.

## సర్కారు వారి పాట



ప్రభుత్వాలు కూడా ఈ హంగామా నుంచి లబ్ధి పొందాలని చూస్తున్నాయి. గత ఆగస్టులో పర్యాటక మంత్రిత్వ శాఖ మనదేశాన్ని ప్రపంచ వివాహాల గమ్యస్థానంగా ప్రకటించింది. పటిష్ఠమైన వివాహ, కుటుంబ వ్యవస్థ ఉన్న గడ్డ మీద పెళ్లిళ్లు చేసుకోవడానికి, విదేశీ జంటలను ఘనంగా ఆహ్వానిస్తున్నది.

## వరుడు నిజాం.. వధువు బేగం



పెళ్లి బట్టలు మరింత ప్రత్యేకంగా ఉండాలనుకునే వారికోసం పటౌడీ హౌస్ 'నూర్-ఎ- నిజాం' పేరుతో డిజైనర్ దుస్తులను తయారు చేయించింది. వీటికి హైదరాబాద్ నిజాంల వస్త్రధారణ స్ఫూర్తి. వెండి, బంగారాలను మేళవించి జర్దోసీ కుట్టుపని చేయడం మహా విశేషం. మరో సంస్థ 'ద పాసేజ్ టు పర్షియా' ఇరాన్ సంస్కృతి, వస్త్రధారణ స్ఫూర్తితో వివాహ వస్త్రాలు డిజైన్ చేస్తున్నది.

## వైవిధ్యంగా..




ఇతరులతో పోలిస్తే తమ పెండ్లి ప్రత్యేకంగా జరగాలని చాలామంది కోరుకుంటారు. వేదికల విషయంలోనూ వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఢిల్లీలో ఓ జంట తమ పరిసరాల్లోనే కొంగొత్తగా పెళ్లాడాలని అనుకున్నది. అదీ ఫారెస్ట్ థీమ్‌ను ఎంచుకున్నది. కానీ, కాంక్రీట్ జంగల్‌లో సహజమైన అడవి ఎలా పుట్టుకొస్తుంది? పూలు, పండ్లు, అలంకరణ అన్నీ అడవిని తలపించేలా జాగ్రత్త పడ్డారు. వరుణ్‌తేజ్ – లావణ్య త్రిపాఠి జంటలా ఏ ఇటలీకో వెళ్లి డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకునేవారి సంఖ్యా తక్కువేం కాదు.

## లక్షల కోట్ల వ్యాపారం



కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) ప్రకారం ఈ ఏడాది నవంబర్ 23–డిసెంబర్ 15 మధ్య దేశంలో 35 లక్షల పెళ్లిళ్లు జరగనున్నాయి. షాపింగ్ కోసం 4 లక్షల 25 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనున్నట్టు అంచనా. లెక్కలకు అందని సొమ్ము దీనికి రెట్టింపు ఉండవచ్చు. 2022తో పోలిస్తే ఈసారి ముహూర్తాలు 15 శాతం తక్కువగా ఉన్నాయని పురోహితులు చెబుతున్నారు. అందుకే రద్దీ ఇంత ఎక్కువగా ఉన్నది.

## డెస్టినేషన్స్



వధూవరులు గోవా, కేరళ రాష్ట్రాల్లోని బీచ్‌లు, జైపూర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, పుష్కర్, రణథంబోర్ లాంటి చారిత్రక ప్రాంతాలు, కొండలు, గుట్టలు, అడవులను వివాహ వేదికలుగా ఎంచుకుంటున్నారు. కోటల్లో పెళ్లిళ్లు కూడా ట్రెండింగ్‌లో ఉన్నాయి. కియారా అద్వానీ – సిద్ధార్థ్ మల్హోత్రా, పరిణితి చోప్రా – రాఘవ్ చద్దా లాంటి సెలెబ్రిటీల వివాహాలకు చారిత్రక ప్రదేశాలు గమ్యస్థానాలుగా నిలిచాయి.